క్లుప్తంగా

వైభవంగా తొలి ఏకాదశి పర్వదినోత్సవం



భట్టిప్రోలు (కొల్లూరు) : తొలి ఏకాదశి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని భట్టిప్రోలు మండలంలో వైభవంగా పూజలు నిర్వహించారు. భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు చేపట్టి, అభిషేకాలు, కర్పూర యజ్ఞం నిర్వహించారు. తొలి ఏకాదశి విష్ణుమూర్తి యోగ నిద్రలోకి వెళ్లే రోజు అని, రుషులు, మునులు, ఆశ్రమవాసులు, చాతుర్మాస్య దీక్ష ప్రారంభించుకునే రోజు అని భక్తులకు యల్లాప్రగడ సీతాపతి తెలియజేస్తూ తొలి ఏకాదశి ప్రాముఖ్యతను వివరించారు. మండలంలోని వెల్లటూరు గీతా మందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో జీవీవీ రామారావు, దివి శేషుబాబు, ఆశ్రమ అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి, కోట యశోదాదేవి, పులికొండ దేవసేన, ఆండాళ్లు, పులికొండ సీతారత్నం, బండి వెంకట్రావు, చెన్నా పాపారావు, చందూరు గోపాలకృష్ణమూర్తి, బూర్లె వెంకటేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్‌ఐ రేపల్లె ప్రాంతీయ కమిటీ ఎన్నిక



రేపల్లె: అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రేపల్లె ప్రాంతీయ కమిటీ ఎన్నిక పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న అధ్యక్షతన ఆదివారం జరిగింది. పది మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రామన్న తెలిపారు. కమిటీ కార్యదర్శిగా కేవీ లక్ష్మణరావు, అధ్యక్షుడిగా సీహెచ్ భాను ప్రకాష్, ఉపాధ్యక్షులుగా ఎ.రత్నాకర్, వై.నవీన్, ఎం.సూర్య, వై.బాలనాగులు, సహాయ కార్యదర్శులుగా హేమనాగశ్రీ, వాసు, బి.రామాంజనేయులు, ఎస్.శివశంకర్‌లను ఎన్నుకున్నామన్నారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై కమిటీ అలుపెరగని పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్‌ఐ నాయకులు సీహెచ్ మణిలాల్, కె.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



కొల్లూరు : మొహర్రం పర్వదిన వేడుకలు కొల్లూరులో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను గ్రామంలోని పురవీధులలో ఊరేగింపుగా తరలించారు. జెండా చెట్టు వద్ద ప్రార్థనల అనంతరం పీర్ల చావిడిలో పీర్లను భద్రపరిచారు. మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ హుసేన్ రజి అల్లా ఉతాలాన్‌హుతోపాటు మరో 72 మంది కుటుంబ సభ్యులు వీర మరణం పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని వారి జ్ఞాపకార్థం మొహర్రం నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా మత పెద్దలు వెల్లడించారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలు నెల పొడుపు నుంచి పది రోజుల పాటు పీర్లను ప్రదర్శనగా ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టినట్లు తెలిపారు. మొహర్రం వేడుకలలో హిందువులు సైతం పాల్గొని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

పట్టుదలకు నిదర్శనం ఏకలవ్యుడు



బాపట్లటౌన్: పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం ఏకలవ్యుడని ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు తెలిపారు. మండలంలోని స్టువార్టుపురంలో ఆదివారం ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు మాట్లాడుతూ ఏకలవ్యుడు మహాభారతంలో ముఖ్యమైన పాత్ర పోషించాడన్నారు. అడవిలో పెరిగిన అడవి బిడ్డ అయినప్పటికీ విలువిద్యలో గొప్ప నైపుణ్యం సాధించాడన్నారు. కఠోర నిష్ఠతో, పట్టుదలతో విలువిద్య నేర్చుకుని, అద్భుతమైన ప్రతిభను కనబరిచాడన్నారు. ఈ సందర్భంగా ఏకలవ్యుడి విగ్రహానికి పూల మాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర నాయకులు బోగిరి శ్రీకాంత్‌మిత్ర, రాష్ట్ర కార్యదర్శి పాకాల రాజేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు తుమ్మ శ్రీనివాసులు, జిల్లా యూత్ ప్రెసిడెంట్ బాచ్చు భారత, జిల్లా జనరల్ సెక్రటరీ మోట చక్రవర్తి, గ్రామ సర్పంచ్ రాగాల రాము, గ్రామ నాయకులు కొండారెడ్డి అనిల్, కొండారెడ్డి సంజీవ్ పాల్గొన్నారు.

జెట్టీ నిర్మాణం జరిగేనా..?

- నెరవేరని మత్స్యకారుల కల
- లంగర్ వేసేందుకు నానా ఇబ్బందులు



ఈపూరుపాలెం డ్రైన్‌లోనే లంగర్ వేసుకున్న పడవలు

బాపట్ల: సముద్రంలో వేట సాగించిన తరువాత పడవలను లంగర్ వేసుకునేందుకు జెట్టీ నిర్మాణం ఇప్పట్లో నెరవేరేలా కనిపించటం లేదు. చెన్నై నుంచి నిపుణుల బృందం దాన్వాయ్‌పేట, కృపానగర్ మధ్యలో జెట్టీ నిర్మాణానికి అనుకూలమైన స్థలంగా ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జెట్టీ లేకపోవటంతో వేటకు వెళ్లి వచ్చిన తరువాత పడవలు నిలుపుకునేందుకు రెండు, మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు గత ప్రభుత్వం ఈపూరుపాలెం వద్ద జెట్టీ నిర్మాణానికి తీవ్ర ప్రయత్నం చేసింది. కానీ ఎంపెడా నుంచి అనుమతులు మంజూరు కాకపోవడంతో జెట్టీ నిర్మాణం సాధ్యపడలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం వాటి జోలికే పోవటం లేదు. కనీసం ఆ ఆలోచన కూడా చేయడం లేదు. దీంతో మత్స్యకారులు అసలు జెట్టీ నిర్మాణం జరుగుతుందా అని ఆవేదన చెందుతున్నారు. జెట్టీ నిర్మాణం నెరవేరని కలగానే మిగిలిపోతుందా అని ఆందోళనలో ఉన్నారు.

ఇదీ పరిస్థితి

బాపట్ల జిల్లాలో సూర్యలంక, రామానగర్, ముత్తాయిపాలెం, విజయలక్ష్మి, దాన్వాయ్‌పేట, కృపానగర్, అడవిపల్లిపాలెం, రామచంద్రపురం, తుమ్మలపాలెం ప్రాంతాలకు చెందిన వారి వద్ద 250 పడవలు వరకు ఉన్నాయి. వీటిపై రెండు వేల కుటుంబాల వరకు ఆధారపడి జీవిస్తుంటారు. సూర్యలంక, రామానగర్, ముత్తాయిపాలెంకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేట సాగించి సముద్రం వద్ద ఉన్న పొరుగులో నుంచి వెదుళ్ళపల్లి డ్రైన్‌లోకి పడవవలను తెచ్చి



ఈపూరుపాలెం బ్రిడ్జికి కట్టిన పడవలు

పెట్టుకుంటారు. సుమారు రాకపోకలకు అదనంగా ఐదు కిలోమీటర్లు మేర ఆయిల్ వృధా ఖర్చుగా మారింది. అదే విధంగా దాన్వాయ్‌పేట, కృపానగర్, అడవిపల్లిపాలెం, రామచంద్రపురానికి చెందిన మత్స్యకారులు వేట పూర్తి చేసుకున్న తరువాత ఈపూరుపాలెం డ్రైన్‌లో పడవలను తెచ్చి పెట్టుకుంటున్నారు. ఈ విధంగా డ్రైన్‌లో పడవలు పెట్టుకోవటం వలన తుఫాన్లు వచ్చినప్పుడు పడవలు ఆటుపోటులకు తీవ్ర దెబ్బతింటున్నాయి. జెట్టీ నిర్మాణం జరిగితే పడవలకు రక్షణగా ఉంటుందని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు



జెట్టీ నిర్మాణానికి దాన్వాయ్‌పేట, కృపానగర్ సమీపంలో సముద్రంపై అనుకూల ప్రదేశమని ఎంపెడా నిర్ణయించింది. ఈ మేరకు చెన్నై నుంచి కూడా అధికారుల బృందం రెండేళ్ల క్రితం పరిశీలించింది. ప్రాజెక్టుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపారు. గత ప్రభుత్వం జెట్టీ నిర్మాణానికి కృషి చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం పట్టించుకోవటం లేదు.

– కొక్కిలిగడ్డ చెంచయ్య,
మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ శేషగిరిరావు, నాయకులు

రేపల్లె: బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆదివారం పూల మాలవేసి నివాళులర్పించారు. దేశ ఉప ప్రధానిగా, దేశ తొలి కార్మిక శాఖ మంత్రిగా అనేక పదవులు అలంకరించారని, గొప్ప పరిపాలనాదక్షుడిగా అందించిన సేవలు ఎనలేనివన్నారు. జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో తమ పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కర్రీ వెంకట కృష్ణారెడ్డి, జిల్లా ఇంటలెక్చువల్ ప్రెసిడెంట్ రత్నాకర్, నాయకులు చిమటా బాలాజీ, పద్మావతి, అబ్దుల్ ఖుద్దూష్, గౌస్, జ్యోతి, నీలా నాంచారయ్య, లియాఖత్ భాషా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక లోకానికి నష్టం చేసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్



మాట్లాడుతున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

రేపల్లె: కార్మిక లోకానికి నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కార్మిక ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు కార్మికులకు కనీస వేతనం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ చేయాలన్నారు. కేంద్రంలో 8వ వేతన సంఘాన్ని, 12వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించి ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేస్తూ కార్మికుల సంక్షేమానికి పాలక ప్రభుత్వాలు పని చేయాలన్నారు. హక్కులను సాధించుకునేంత వరకు వెనకడుగు వేసేది లేదన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు సింగం వాణిశ్రీ, ఎం.శోభారాణి, పి.బిక్షాలు, కోనా శ్రీను, కె.ఝాన్సీ, పి.విజయ్, కె.ఆశీర్వాదం, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన కార్యక్రమంలో టీడీపీ నాయకులకు చుక్కెదురు

నిలదీసిన మహిళలు



మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డిని నిలదీస్తున్న 33వవార్డు మహిళలు

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన కార్యక్రమానికి బాపట్లలో చుక్కెదురైంది. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పట్టణంలోని 33వ వార్డులో పర్యటించేందుకు ఆదివారం నిర్ణయించుకున్నారు. అయితే ముందుగానే ఆ వార్డులో తమకు అనుకూలమైన ఐదు గృహాలను ఎంపిక చేయాలని, వారిని మాత్రమే ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు కలుస్తారని చెప్పటంతో ఆ వార్డు పరిధిలోని అరవ కాలనీలో మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మా కాలనీలో కూడా పర్యటించాలని మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డిని నిలదీశారు. వార్డులోని అన్ని కాలనీల్లో కనీసం ఐదు గృహాలైన సందర్శించే విధంగా చూసుకోవాలని స్థానిక మహిళలు మేకల శేషమ్మ, తోట మరియమ్మతో కూడిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల పాలిట శాపం



పడమర కాల్వ వెంట వ్యర్థాల గుట్టలు

తెనాలి అర్బన్: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. కాల్వల్లోని వ్యర్థాలను బయటకు తీసి రోడ్డుపై పోసి వదిలేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పట్టణంలోని పడమర కాల్వ పూడికతీత పనులను నెల కిందట ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. కాల్వల్లో వచ్చిన వ్యర్థాలను పక్కనే ఉన్న ప్రధాన రహదారిపై పోశారు. యడ్ల లింగయ్య పెట్రోలు బంక్ నుంచి డీఎస్పీ కార్యాలయం వెనుక రోడ్డు వరకు ఇదే పరిస్థితి ఉంది. దీనివల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి వ్యర్థాల గుట్టలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యతో జీవితంలో ఉన్నత స్థితి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు

తెనాలి అర్బన్: విద్యతో జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. జాబిల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో తెనాలి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి 580 మార్కులకు పైగా సాధించిన ఏడుగురు విద్యార్థులకు రూ.2000 చొప్పున నగదు బహుమతులు, మెమెంటో, సర్టిఫికెట్లను ఆదివారం తెనాలిలో అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షుడు కొసరాజు వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేస్తున్నామని చెప్పారు. నేలపాడులో ప్రభుత్వ సహకారంతో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎ.ఆంజనేయులు, శైలజ, పూర్ణచంద్రరావు, ప్రసాద్, పి.విజయలక్ష్మి, శ్రీదేవి, బి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



కమిటీ నేతలతో వెంకటేశ్వరరావు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ సమావేశం జగడిగుంటపాలెంలోని ప్రగడ కోటయ్య నగర్ పద్మశాలి కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించారు. సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో సంఘం జగ్గడిగుంటపాలెం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగర సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా చింతిక్రింది కోటిస్వామి, కార్యదర్శిగా కటకం యుగంధర్, సహాయ కార్యదర్శులుగా దామర్ల సుబ్బారావు, గంగనపల్లి సువర్ణరాజు, పానుగంటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా కొడాలి వంశీ, జొన్నాదుల నాగేశ్వరరావు, డోగుపర్తి భద్రయ్య, దేశబోయిన శ్రీనివాసరావు, కాగితాల వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనాగమణి ఎన్నికయ్యారు. వీరందరికీ వెంకటేశ్వరరావు నియామక పత్రాలు అందజేశారు. బీసీల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జొన్నాదుల వెంకటసాయి మణికంఠ, గుర్రం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతో మానవాళికి మేలు



వాకింగ్ ట్రాక్ చుట్టూ మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

కొల్లిపర: మొక్కల సంరక్షణ ద్వారా మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని శ్రీ కళా నిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కొల్లిపరలోని అవుతురామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలోని వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యార్థినులు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్ విశ్వవిద్యాలయ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సొంత ఖర్చులతో క్రోటన్ మొక్కలు కొని, వాకింగ్ ట్రాక్ చుట్టూ నాటడం మంచి పరిణామని కొనియాడారు. రానున్న రోజులల్లో మరెన్నో మంచి పనులు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడంబరంగా అమ్మవారికి ఆషాడ సారె



గ్రామ దేవత చింతలమ్మ అమ్మవారికి ఆషాడ సారె సమర్పించేందుకు ఊరేగింపుగా తరలివెళుతున్న గౌడపాలెం మహిళలు



సీతమ్మ తల్లికి ఆషాడ సారె సమర్పణకు ఊరేగింపుగా తరలివెళుతున్న మహిళలు

కొల్లూరు : అమ్మవారి చల్లని చూపుతో గ్రామం సుభిక్షంగా ఉండాలని.. సకాలంలో వర్షాలు పడి.. పచ్చటి పంటలతో కుటుంబాలు సంతోషంగా ఉండేలా కటాక్షించాలని గ్రామ దేవత చింతలమ్మ అమ్మవారికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆషాడమాసపు సారె సమర్పించారు. ఆదివారం కొల్లూరు గౌడపాలెంకు చెందిన మహిళలు ఆషాడ సారెకు సంబంధించిన సామగ్రితో గ్రామోత్సవం నిర్వహించి అనంతరం గ్రామ దేవతలైన చింతలమ్మ, అంకమ్మ అమ్మవార్లకు సమర్పించారు. గౌడపాలెం అంకమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి దైవ నామస్మరణతో ప్రదర్శనగా లాక్ సెంటర్ రోడ్డులోని జమ్మి చెట్టు వద్దకు తరలివెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా చింతలమ్మ, అంకమ్మల ఆలయానికి చేరుకొని ఆడంబరంగా ఆషాడమాసపు సారెను అమ్మవార్లకు సమర్పించారు.

ఉప్పు వారి రామ మందిరం ప్రాంతంలో...

కొల్లూరు : గ్రామ దేవతల అనుగ్రహం కోసం సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆషాడమాసపు సారె ఉత్సవం మహిళల ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం కొల్లూరు ఉప్పు వారి రామ మందిరం ప్రాంతానికి చెందిన మహిళలు సీతమ్మ తల్లి, అంకమ్మ తల్లి, దుర్గాభవాని అమ్మవార్లకు ఆషాడమాసపు సారె సమర్పణ కార్యక్రమం చేపట్టారు. ఉప్పు వారి రామ మందిరం ప్రాంగణంలో తొలుత పూజలు నిర్వహించి ఆంధ్రాబ్యాంక్ రోడ్డు నుంచి లాక్ సెంటర్ రోడ్డు, అంకమ్మతల్లి ఆలయం మీదుగా ఊరేగింపుగా అమ్మవార్లకు సమర్పించే సారెలు చేతబూని గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక జమ్మిచెట్టు వద్ద పూజల అనంతరం అంకమ్మతల్లి, సీతమ్మవారు, దుర్గాభవాని అమ్మవార్లకు ఆషాడమాసపు సారె భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద మహిళలు చేపట్టిన భక్తి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత, తెనాలి శాఖ ఆదివారం మరో సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. సమీపంలోని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ట్రై సైకిళ్లను పంపిణీ చేసింది. వేమూరు మండల గ్రామం పెరవలిపాలేనికి చెందిన పెరవలి వినయ్‌కుమార్, వేమూరు నివాసి పిల్లి శరత్‌కు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి చేయూతనిచ్చేందుకు మానవత సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందని చెప్పారు. ఇందు కోసం సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ పని చేస్తున్నట్టు చెప్పారు. సహకరిస్తున్న సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మానవత తెనాలి ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, సంస్థ మహిళా విభాగ అధ్యక్షురాలు కె. కల్యాణి, కార్యదర్శి పి వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, కోశాధికారి ఎస్.వి. శర్మ, సభ్యులు చిట్టినేని సాంబశివరావు, పరుచూరి మల్లికార్జునరావు, మల్లాది అర్జున్, కావూరి నాగేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, పి.శివరాజ కుమారి, కె.రవీంద్రనాథ్, కె.మదన్‌మోహన్‌రావు, కార్తిక్ పాల్గొన్నారు.

పసుపు విత్తు సమయంలో జాగ్రత్తలు అవసరం

కొల్లిపర: పసుపు విత్తు సమయంలో రైతులంతా జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలో నాగలి ద్వారా విత్తనం వేస్తున్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. విత్తనం సుమారు 30-40 గ్రాముల బరువు కలిగి, ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు పచ్చి కొమ్ములు అవసరమని చెప్పారు. పొలంలో విత్తు సమయంలో లోతు 8 నుంచి 12సెం.మీ ఉండే విధంగా నాగలితో దున్నాలని ఆయన సూచించారు. అప్పుడే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

విత్తన శుద్ధి

- పసుపు కొమ్ములు విత్తేటప్పుడు వారం రోజులు ముందుగానే పరిశీలించుకోవాలి. కుళ్లిన వాటిని తీసేయాలి.
- కొమ్ములను తప్పనిసరిగా రిడోమిల్ (మేటలాక్సిల్4% + మాంకోజెబ్64%) మూడు గ్రాములు లీటరు నీటికి లేదా ట్రైకోడర్మా ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి శుద్ధి చేయాలి.
- నిల్వ ఉంచిన కొమ్ములకు పొలుసు పురుగులు ఆశిస్తే మోనొక్రోటోఫాస్ రెండు మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి శుద్ధి చేసుకోవాలి.
- దీనివల్ల విత్తనాల ద్వారా సంక్రమించే దుంప కుళ్లు, వేరు కుళ్లు , తాటాకు, ఆకు మచ్చ తెగుళ్లను ముందుగానే అరికట్టవచ్చు. విత్తన శుద్ధి చేసిన తర్వాతే పొలంలో నాటాలి.

జీవో నంబర్ 77 పీజీ విద్యార్థుల పాలిట శాపం

ప్రత్తిపాడు: పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు బస్టాండు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యశ్వంత్ రఘువీర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. వంద రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని గద్దెనెక్కిన తరువాత విస్మరించారని మండిపడ్డారు. నామమాత్రంగా రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులిపేసుకున్నారని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మైలా డేవిడ్, సుదర్శనం అమర్నాథ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అజయ్, సాయిగణేష్, కిరణ్, సంతోష్, ప్రవీణ్, రాజా శేఖర్, యశ్వంత్, రాజేంద్ర, గణేష్, అజయ్ పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై దాడి చేసిన ఒడిశా యువకుడు

చేబ్రోలు: రియల్ ఎస్టేట్ ప్రాంతంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న దంపతులపై మద్యం మత్తులో ఒడిశా యువకుడు దాడి చేసిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వడ్లమూడి అడ్డరోడ్డు వద్ద రియల్ ఎస్టేట్ ప్రాంతంలో నగిడి కృష్ణ, రమాదేవి దంపతులు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి ఒడిశాకు చెందిన యువకుడు మద్యం మత్తులో కృష్ణతో వాగ్వాదానికి దిగి దాడి చేసి గాయపరిచాడు. ప్లాట్ యజమాని, స్థానికులు గాయపడిన కృష్ణను స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రమాదేవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జనరేటర్ చోరీపై కేసు నమోదు

చేబ్రోలు: షాపు ముందు ఉంచిన లైటింగ్ జనరేటర్ దొంగిలించిన ఘటనపై ఆదివారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలో వేజండ్ల గ్రామానికి చెందిన పఠాన్ జాన్ సైదా ఖాన్ స్థానిక రైల్వే గేట్ సమీపంలో లైటింగ్, మైక్ సెట్లు అద్దెకు ఇచ్చే షాపు నిర్వహిస్తున్నారు. శనివారం షాపు ముందు ఉంచిన సుమారు రూ.2.50 లక్షల జనరేటర్ ఆదివారం ఉదయం చూసే సరికి అదృశ్యమైంది. దీనిపై సైదాఖాన్ ఫిర్యాదు చేయగా ఎస్ఐ వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.